క్లుప్తంగా

క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో విజేత అంతర్గాం



విజేతగా నిలిచిన అంతర్గాం జట్టు సభ్యులు

రామగుండం: పాలకుర్తి మండల పరిధిలోని కోరుకంటి ప్రీమియర్ లీగ్ సీజన్–3 మంగళవారం జరిగిన క్రికెట్ పోటీల్లో తక్కళ్లపల్లి–అంతర్గాం జట్లు ఫైనల్‌లో తలపడగా అంతర్గాం జట్టు విజయం సాధించింది. ఇందులో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా విలేజీ అంతర్గాంకు చెందిన గాదం వెంకటేశ్ నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతు సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: రైతాంగ సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతగానో పాటు పడుతున్నాడని రైతు బంధు సమితి సభ్యులు గందు రంగయ్య, వైద రమేశ్, రాజయ్య తదితరులు అన్నారు. పెద్దపల్లి శివారు రంగంపల్లిలో మంగళవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పంట సాగుకు అయ్యే పెట్టుబడికి విడతల వారీగా సాయం అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో రఘుపతి, పూదరి మల్లయ్య, రాజయ్య, మోహన్, రాజేశ్వర్‌రావు తదితరులున్నారు.

బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి



సుగ్లాంపల్లి యువత నూతన కార్యవర్గం

సుల్తానాబాద్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డు యువత కమిటీలను నియమించి పార్టీని బలోపేతం చేస్తామని పట్టణ యూత్ అధ్యక్షుడు ఎండీ వాహిద్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు సుగ్లాంపల్లి వార్డు యూత్ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతో పాటు యువతకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూత్ అధ్యక్షుడిగా బెల్ల ప్రశాంత్ ఉపాధ్యక్షులు వేలం రమేశ్ నియమించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పసేడ్ల మమత, వార్డు అధ్యక్షుడు పాపనీ సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

రిలే దీక్షకు బీసీ నేతల సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీగణన చేపట్టి, రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లిలో బహుజన సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్ష మంగళవారం 6వ రోజుకు చేరింది. ఈ దీక్షా శిబిరాన్ని బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, నాయకులు లక్ష్మణ్, కంకటి శ్రీనివాస్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అధిక జనాభా ఉన్న బీసీలకు అన్నిరంగాల్లో అన్యాయమే జరుగుతుందని శంకర్ అన్నారు. పదిశాతం కూడా జనాభాలేని అగ్రవర్ణాల చేతికే అధికారం దక్కుతోందని ఇదంతా వారి కుట్రల వల్లేనని ఆరోపించారు. నాయకులు శేఖర్, వెంకటేశ్, శేషాద్రి, పూరెల్ల స్వప్న, నర్ల గోపాల్, మధు, రాహుల్, పర్శరాం, శ్రీధర్ తదితరులున్నారు.

సదరం 'స్లాట్' కష్టాలు



సుల్తానాబాద్: సదరం శిబిరంలో పాల్గొనేవారు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని అధికారులు ప్రకటించడంతో ప్రజలు మీసేవ కేంద్రాల ముందు బారులు తీరుతున్నారు. మంగళవారం సుల్తానాబాద్‌లోని మీసేవ కేంద్రం వద్దకు భారీగా తరలివచ్చి ఇలా పడిగాపులు కాశారు.

అభివృద్ధిలో కమాన్ 'పూర్'

- సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం లేదు
- తహసీల్దార్ కార్యాలయానికి పక్కా భవనం కరువు
- కొనసాగుతున్న పంచాయతీ భవన పనులు
- సర్వసభ్య సమావేశం వాయిదాతో చర్చకు రాని సమస్యలు



సెంట్రల్ లైటింగ్‌కు నోచుకోని ప్రధాన రహదారి

కమాన్‌పూర్: మండల కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. గ్రామంలో అనేక సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేటి పాలకులు నెరవేర్చడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలాల విభజనలో కమాన్‌పూర్ మండలాన్ని విభజించడంతో మండల కేంద్రాన్ని పట్టించుకున్న వారే లేరని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

కానరాని సెంట్రల్ లైటింగ్..

కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు నుంచి మండల కేంద్రం మీదుగా జూలపల్లి కోల్ కారిడార్ వరకు డబుల్ రోడ్డు పనులు విస్తరించిన మండల కేంద్రంలో మాత్రం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు వాపోతున్నారు. డబుల్ రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని హామీలిచ్చినా నేటి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు మోక్షం కలగలేదు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

మండలాల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయానికి పక్కా భవనం ఏర్పాటు చేయలేదు. అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయానికి పక్కా భవనం ఏర్పాటు చేయలేకపోతున్నారు.

కొనసాగుతున్న జీపీ భవన నిర్మాణం

గతంలో ఉన్న కమాన్‌పూర్ గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో గత కొన్నేళ్ల క్రితం కూల్చివేసి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణానికి అప్పుడు రూ. 12 నిధులు మంజూరు కాగా, ఆ నిధులు సరిపోకపోవడంతో అప్పటి నుంచి భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇటీవల గ్రామపంచాయితీ నిధులను కేటాయించడంతో పనులు కొనసాగుతున్నాయి.

ఊసే లేని షాపింగ్ కాంప్లెక్స్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని గతంలో ప్రజలకు హామీలిచ్చిన నేటి వరకు నోచుకోలేదు.

అస్తవ్యస్తంగా డ్రైయినేజీ..

కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు నుంచి మండల కేంద్రం వరకు ఏర్పాటు చేసిన డబుల్ రోడ్డుకు ఇరువైపుల డ్రైయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో వరదనీరు ఇళ్లలోకి చేరి, రహదారిపై పారుతుండంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో గతంలో ఉన్న డ్రైయినేజీ పూర్తిగా శిథిలావస్థ చేరి కూలి పోవడంతో పూడికతో నిండిపోవడంతో వర్షాకాలంలో రహదారి పైకి మురుగునీరు వచ్చి చేరుతుండంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



నిర్మాణ దశలో ఉన్న పంచాయతీ భవనం

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



పరిశీలిస్తున్న కమిషనర్ సుమన్‌రావు

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని నవోదయ హైస్కూల్ ప్రాంగణంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు కల్పించిన ఏర్పాట్లు, కొనసాగుతున్న వైద్య పరీక్షలు తదితర అంశాలపై పరిశీలించారు. ఆయనతో స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ ముదాం తిరుపతి, వైద్య సిబ్బంది డాక్టర్ చేరాలు, డాక్టర్ మాధురి, హెల్త్ అసిస్టెంట్ వడ్డెపల్లి సమ్మయ్య, శంకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే విధంగా చేపట్టిన కంటివెలుగు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ నిలీమ, శానిటరీ సూపర్ వైజర్ అడుప సోమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండలం నారాయణపూర్‌లో మంగళవారం కంటి వెలుగును ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మూల స్వరూప, ఎంపీటీసీ రమేశ్, ఉపసర్పంచ్ రామారావు, వైద్యులు తదితరులున్నారు.

ఎలిగేడు: మండలకేంద్రంలోని జీపీ కార్యాలయంలో జరుగుతున్న కంటివెలుగులో మంగళవారం 153 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 14 మందికి కంటి అద్దాలను అందజేసినట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూర్ల సింధూజ, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు కుమ్మరికుంటలో కంటివెలుగులో పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి సంపత్ రెడ్డి కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలను చేయించారు. కార్యక్రమంలో సర్పంచులు నర్సింహయాదవ్, సంతోశ్‌రావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఐదో డివిజన్‌లో కంటి వెలుగు ప్రారంభం

జ్యోతినగర్: ఐదో డివిజన్ పరిధిలోని నర్రాశాలపల్లెలో నేటి నుంచి కంటివెలుగు ప్రారంభిస్తున్నట్లు కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి అన్నారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు కంటివెలుగు వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కంటి వెలుగు కేంద్రంలో కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నారని తెలిపారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా



అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఎంపీపీతో పాటు ఆరుగురు ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు హాజరు కావాల్సి ఉండగా ఎంపీపీతో పాటు పేంచికల్‌పేట ఎంపీటీసీ గొడిసెల ఉమ మాత్రమే హాజరు కాగా, సమయానికి సభ్యులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. మూడు నెలల క్రితం నిర్వహించిన సమావేశానికి కోరం సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఇప్పటికీ సమావేశాలను వాయిదా వేయడంతో సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిని సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆశించామని, ఇప్పుడు సమావేశం జరగకపోవడంతో సమస్యలను ఏలా పరిష్కరించుకోవాలి ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య ఉంటుందని, దానిని పరిష్కరిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు జెడ్పీటీసీగా గెలుపొందిన కమాన్‌పూర్ మండలంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే మండల సమావేశానికి హారుకపోవడాన్ని ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

అద్దె వాహనాల డ్రైవర్ల సమ్మెకు సంఘీభావం



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

రామగిరి: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న అద్దె వాహనాల డ్రైవర్లకు చట్టబద్ధమైన వేతనాలు చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి డిమాండ్ చేశారు. మూడు రోజులుగా అద్దె వాహనాల డ్రైవర్లు చేస్తున్న సమ్మెకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ అద్దె వాహనాల డ్రైవర్లకు కొత్త సర్క్యులర్ ప్రకారం అక్టోబర్ 2022 నుంచి పెరిగిన వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో త్వరలో చేపట్టనున్న నిరవధిక సమ్మెకు బీజేపీ మద్దతు తెలిపి, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు జంగపల్లి అజయ్, నాయకులు ములుమూరి శ్రీనివాస్, మట్ట శంకర్, రాము, అద్దెవాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

ఈసీ ఏఎన్ఎంలకు 30 శాతం పెంపు

సుల్తానాబాద్: జిల్లా వ్యాప్తంగా (యూరోపియన్ స్కీం)ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారికి 30 శాతం జీతాలు పెంచినట్లు కమిషనర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ శ్వేత మహంతి ఉత్తర్వులను జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్‌కు పంపించారు. జిల్లా వ్యాప్తంగా 14 మంది ఏఎన్ఎంలు పనిచేస్తున్నారని, వారికి రూ 9,60,957 విడుదల చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 23న ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వీరికి నెలకు రూ . 21,230 జీతం వస్తుండేదని 30% పెరగడంతో రూ 27,200 రానున్నట్లు ఇన్‌చార్జి పాషా తెలిపారు.

'విద్యుత్ కోతలపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం'

పెద్దపల్లిరూరల్: విద్యుత్ కోతలపై రాష్ట్రప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని, కరెంట్ ఎప్పుడొస్తుందో అధికారులకు కూడా తెలియడం లేదని బీజేపీ నాయకుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అప్రకటిత కోతలతో పంటలు ఎండిపోయే ప్రమాదముందన్నారు. ఈ విషయంలో రైతులకు స్పష్టత ఇవ్వాలని సూచించారు. నాయకులు కట్కూరి సత్యనారాయణరెడ్డి, రాజీవీరు, మనోహర్, సయ్యద్ ఫయాజ్, లింగంపల్లి కరుణాకర్, వునుకొండ భూమయ్య, తిరుపతి, రవితేజ, గంగుల సతీశ్, శ్రీధర్ తదితరులున్నారు.

పంచాయతీ భవన నిర్మాణ పనులు పరిశీలన

కమాన్‌పూర్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులను జిల్లా అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో ఆరీఫ్, పీఆర్ ఏఈ రాధ, పంచాయతీ కార్యదర్శి హరీశ్ ఉన్నారు.

ఉచిత ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పల్లె ప్రతిమ కోరారు. మండలంలోని రత్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ కేవైసీ అప్‌డేట్ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. జాబితాలో పేరు వచ్చిన వారందరూ కేవైసీ అప్‌డేట్‌తో పాటు మొబైల్ నంబర్ లింక్ చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ పెండ్లి రమ్య, నాయకులు ఉడుత శంకర్, సందవెన కుమార్ పాల్గొన్నారు.

'ప్రజలు ఆదరించడం లేదనే అక్కసుతో ఆరోపణలు'

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గ ప్రజలు ఓ సారి అవకాశమిచ్చి.. రెండు సార్లు ఓడించారు.. ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న ఆరాటమే తప్ప పెద్దపల్లి పట్టణం ఎలా అభివృద్ధి చెందుతుందో కనిపించడం లేదా అని బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలో మాటాడుతూ గడపగడపకు కాంగ్రెస్ పేరుతో తిరుగుతూ ఎమ్మెల్యే మున్సిపల్ చైర్‌పర్సన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రైతాంగానికి మేలు చేసే పథకాలను అమలు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. ఎన్నికలెపుడొచ్చినా మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం అన్నారు. సమావేశంలో నాయకులు మాటం శంకర్, కొలిపాక రాజేశం, నక్క రమేశ్ తదితరులున్నారు.

భయాన్ని వీడితే విజయం తథ్యం



మాట్లాడుతున్న వేణుకళ్యాణ్

ధర్మారం: విద్యార్థులు పరీక్ష సమయంలో భయాన్ని వీడితే విజయం సాధించటం సులభమని ప్రముఖ మోటీవేషన్ స్పీకర్ వేణు కళ్యాణ్ అన్నారు. ధర్మారంలోని గౌతమి బుద్ధ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సాయి మణికంఠ మోడ్రన్ హైస్కూల్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ మనిషిలో భయం వీడితే అన్ని సమస్యలు అవే పరిష్కారమవుతాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఎలా ఉండాలనే విషయాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జైన సురేశ్ కుమార్, ఎండీ రమాదేవి ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

జ్యోతినగర్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని హరిహర ఆలయ ప్రాంగణం, వైకుంఠపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం అర్చకులు రామాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏసీడీ బిల్లులు రద్దు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామగుండం: ప్రభుత్వం తక్షణమే విద్యుత్ వినియోగదారులపై మోపుతున్న వార్షిక వినియోగ డిపాజిట్ (ఏసీడీ) బిల్లులను రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. అంతర్గాం మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టి, ఏఈ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై వినియోగించుకునే యూనిట్ల ఆధారంగా అదనపు రుసుము వసూలు చేస్తున్నప్పటికీ ఏసీడీ పేరుతో మళ్లీ వినియోగదారులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడం సరికాదన్నారు. ఇప్పటికైనా డీజిల్, పెట్రోల్, గ్యాస్ సిలిండర్లతో పాటు విద్యుత్‌పై పెరుగుతున్న ధరలతో సామాన్య కుటుంబాలు తల్లడిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటించుకోవడం బూటకమని, నిరంతరం విద్యుత్ సరఫరా చేయకుంటే రాబోయే రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి, కోకన్వీనర్ ఆడెపు శంకరన్న, జిల్లా నాయకులు గొల్లపల్లి చంద్రన్న, మార్త రాములు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ



బియ్యం పరిశీలిస్తున్న సాయిరాంనాయక్

రామగుండం: పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని మంగళవారం జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు భూక్య సాయిరాంనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా కిచెన్, విద్యాలయానికి సరఫరా చేసే బియ్యం, టాయిలెట్స్, బాత్రూమ్స్ పరిశీలించారు. విద్యాలయంలో నిరంతరం భగీరథ తాగునీటిని సరఫరా చేయాలని, ప్రాంగణంలోని చుట్టు పక్కల పిచ్చి మొక్కలు పెరగడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని విజిలెన్స్ ప్రతినిధికి తెలిపారు. అనంతరం విద్యార్థుల సమస్యలపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎస్టీ కాలనీ నుంచి విద్యాలయం వరకు రహదారిని నిర్మించాలని కోరుతూ ప్రిన్సిపాల్ ఎం.మంజుల లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. రహదారి నిర్మాణంపై కలెక్టర్‌ను కలిసి రోడ్డు నిర్మాణం చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అంటరానితనం అమానుషం

ఓదెల: అంటరానితనం అమానుషమని ఓదెల ఆర్ఐ రాజేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని పొత్కపల్లి లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ గ్రామంలోని వారందరూ సోదరభావంతో కలిసిమెలిసి బతకాలన్నారు.

ఎలిగేడు: మండలంలోని లోకపేటలో మంగళవారం అధికారులు సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో కుల వివక్షత లేకుండా అందరు సమానమే భావనతో ప్రజలందరు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరనేని ప్రభావతి, ఉపసర్పంచ్ చుంచుల మల్లేశం, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కూనారంలో మంగళవారం సివిల్‌రైట్స్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ, ఎంపీటీసీ రమాదేవి, ఆర్ఐ వైశాలి, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఎస్సై రాజవర్ధన్, కులసంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామగిరి: గ్రామాల్లో నెలకొన్న అసమానతలను రూపుమాపడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్ఐ రాజిరెడ్డి సూచించారు. మండల కేంద్రమైన ముత్తారంలో మంగళవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అంటరానితనం, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూలపల్లి: ప్రజలు హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ జయశ్రీ సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహయాదవ్, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఉప సర్పంచ్ మహేశ్, అధికారులు, .గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సారెస్పీ కాలువ గండి పూడ్చివేత

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లో శ్రీకోదండ రామాలయం వెనుక ఎస్సారెస్పీ కాలువకు పడిన గండిని మంగళవారం పూడ్చివేశారు. కాలువకు గండి పడి నీటి సరఫరా నిలిచి పోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్పందించిన ఈసాల తక్కళ్లపల్లి సర్పంచ్ ముక్కెర రాజకుమారి ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సారెస్పీ వర్క్ ఇన్స్‌పెక్టర్ యాదగిరి సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో కాలువ గండిని పూడ్చివేశారు. తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కుష్ఠు నివారణపై విద్యార్థులకు అవగాహన

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కుష్ఠు నివారణ పక్షోత్సవాల్లో భాగంగా మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అధ్వర్యంలో కుష్ఠు నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం, గ్రామాల్లో కుష్ఠు నివారణ గుర్తింపునకు సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో వ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం సరస్వతి, ఎంపీడీవో వేణుగోపాలరావు, పీహెచ్‌సీ సీహెచ్‌వో కలీమొద్దీన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ నమోదు పూర్తి చేయాలి

జూలపల్లి: ఓటరు కార్డుకు ఆధార్ నమోదును వేగవంతం చేయాలని తహసీల్దార్ జయశ్రీ సూచించారు. మండలంలోని బాలరాజుపల్లె లో ఆంగన్‌వాడీ టీచర్లు (బీఎల్‌వో)ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓటుకు ఆధార్ అనుసంధాన నమోదును లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సదయ్య, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌తోట లక్ష్మీ,బీఎల్‌వోలు, ఉమారాణి,శైలజ, నర్సమ్మ, సత్తవ్వ, ఆలేఖ్య, రాజనర్సమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా మండల కో ఆర్డినేటర్‌గా విజయ్ గౌడ్

రామగిరి: ముత్తారం మండల కేంద్రానికి చెందిన కోల విజయ్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉత్తర్వులు జారీ చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. తన నియామకానికి సహకరించిన శ్రీధర్ బాబుకు, యువ నాయకుడు శ్రీనుబాబుకు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందంకు, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య విజయ్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఎలిగేడు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అందజేయనున్నట్లు తహసీల్దార్ నాగరాజమ్మ తెలిపారు.